క్లుప్తంగా

ఫ్యామిలీ డాక్టర్ సేవలు ఓ వరం


వృద్ధులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అంజలి

గజపతినగరం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో నివశించే వృద్ధులకు 'ఫ్యామిలీ డాక్టర్' సేవలు ఒక వరమని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు అంజలి అన్నారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామం సచివాలయంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులు, దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. సచివాలయ సిబ్బందితో పాటు, ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

నిలిచిపోయిన ఎండీఎం సేవలు

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో ఎండీఎం (రేషన్ డోర్ డెలవరీ) వాహనం గత రెండు నెలలుగా నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు రేషన్ డిపోకు వెళ్లి సరుకులు తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి సరుకులు అందించాలని వీటిని ఏర్పాటు చేసింది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఎండీఎం వాహనం రావడం లేదని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని సీఎస్‌డీటీ ఇందిర వద్ద ప్రస్తావించగా.. ఎండీఎం వాహనం రావడం లేదని ఫిర్యాదు వచ్చిందని, వాహనం మరమ్మతుకు గురైనట్లు సంబంధిత ఆపరేటర్ చెపుతున్నాడని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అంతవరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తామన్నారు.

బురదలో కూరుకుపోయిన లారీ



గజపతినగరం: ఇటీవల కురుస్తున్న అకాల వర్షాల కారణంగా మండల కేంద్రంలోని రోడ్లు అధ్వానంగా మారాయి. బురదతో నిండిన ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా ఇదే రోడ్డులో గురువారం ప్రయాణించిన ఓ లారీ బురదలో కూరుకుపోయింది. దాన్ని బయటకు తీసేందుకు ఎంత ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో మరోవాహనం సాయంతో బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్నారు.

ఉపాధి బిల్లుల చెల్లింపు

గుర్ల: మండలంలోని ఉపాధిహామీ పథకంలో చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించిందని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో పెండింగ్ బిల్లులు రూ.కోటి వరకు చెల్లింపులు జరిగాయన్నారు. మిగిలిన బిల్లులు కూడా పది రోజుల్లో చెల్లించడం జరుగుతుందన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత


బీమా నగదు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొండపల్లి: మండలంలోని నెలివాడ గ్రామానికి చెందిన తుమ్మల సాంబ ఈనెల 2వ తేదీన అనారోగ్యంతో మృతి చెందగా..అతని భార్య రాముకు వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలను స్థానిక సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఉదయ్‌కుమార్ గురువారం ఆమెకు అందజేశారు. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం నామినీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

వేపాడ: మండలంలో సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 'నాడు-నేడు' పనులను ఇంజినీరింగ్ అసిస్టెంట్, సీఆర్పీ గురువారం పరిశీలించారు. పాఠశాలలో నాడు-నేడు నిధులతో టైల్స్, అదనపు భవనాలు, గ్రీన్‌బోర్డులు, రన్నింగ్ వాటర్, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయప్రకాష్ తెలిపారు. వారితో పాటు ఉపాధ్యాయుడు రవిశంకర్, తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

దత్తిరాజేరు: అకాల వర్షాలకు గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ మేరకు గురువారం పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. వీధుల్లో, మురుగు కాలువల్లో చెత్త నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని, బ్లీచింగ్ వేయించాలని సూచించారు. ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

భూసర్వేలో కచ్చితత్వం ఉండాలి

- రైతుల ప్రయోజనాలు దెబ్బతినకూడదు
- ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ


కొత్తవలస: గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయిన రైతుల రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ


ఎస్.కోట: బి.కె.ఆర్.పురంలో సర్వే పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

శృంగవరపుకోట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వేలో కచ్చితత్వం ఉండాలని, రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ అన్నారు. మండలంలోని బీకేఆర్ పురంలో జరుగుతున్న భూముల రీసర్వే పనులను గురువారం ఆమె పరిశీలించారు. సర్వే వివరాలను తహసీల్దార్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో సర్వే పూర్తయింది, ఎన్ని గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేపడుతున్నారు, రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలు, అర్జీలను ఎంతవరకు పరిష్కరించారు తదితర వివరాలను ఆరా తీశారు. సరిహద్దు వివాదాలు తలెత్తకుండా రైతుల సమక్షంలోనే సర్వే రాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

నిర్దేశిత గడువులోగా సర్వే పూర్తిచేయాలి

కొత్తవలస: మండలంలోని సుందరియ్యపేట, రాయపురాజుపేట గ్రామాల్లో చేపడుతున్న భూసర్వేని ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ గురువారం పరిశీలించారు. సర్వే వివరాలను అక్కడ ఉన్న అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రాయపురాజుపేట, సుందరియ్యపేట గ్రామాల్లో సర్వే పూర్తయిందని, హద్దురాళ్లు ఏర్పాటు చేస్తున్నామని సర్వే సిబ్బంది తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తిచేయాలని ఆర్డీఓ ఆదేశించారు. అనంతరం రాయపూర్ గ్రీన్‌ఫీల్డు హైవే రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఉత్తరాపల్లి, దెందేరు గ్రామాల్లో ఇంకా పరిహారం అందని రైతులను తహసీల్దార్ కార్యాలయానికి పిలిచి వారి వద్ద ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. ఆమెతో పాటు ట్రైనీ ప్రత్యేక కలెక్టర్ పి.శ్రీకర్, డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధిని తదితరులు ఉన్నారు.

40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చీపురుపల్లి: మండలంలోని రావివలస గ్రామంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ పంపుసెట్లకు లోవోల్టేజీతో విద్యుత్ సరఫరా అవుతుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను అధిగమించేందుకు ఏపీఈపీడీసీఎల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. వారు తక్షణమే స్పందించి 40 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం లభించినట్లయిందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పనస అప్పారావు, ఎంపీటీసీ కొమ్ము పద్మజ తదితరులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్న భూరక్ష సర్వే రైతుల పాలిట వరం


రంగాపురంలో గ్రామ పటాన్ని ప్రదర్శిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, తహసీల్దార్ రామకృష్ణ, తదితరులు

- ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

లక్కవరపుకోట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న శాశ్వత భూ హక్కు–భూరక్ష సర్వే' రైతుల పాలిట వరమని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గంగుబూడి, రంగాపురం గ్రామాల్లో రీసర్వే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులు దగ్గరుండి భూములను సర్వే చేయించుకోవాలని, అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. తహసీల్దార్ టి.రామకృష్ణ మాట్లాడుతూ రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. గంగుబూడి గ్రామంలో 352.32 ఎకరాలు, రంగాపురం గ్రామంలో 830.18 ఎకరాల్లో రీసర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు సర్వే బృందానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, మండల సర్వేయర్ గ్రంధి రామం, గంగుబూడి సర్పంచ్ గొలగాని హరిప్రసాద్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ దొడ్డు రాంబాబు, గొలగాని సత్యనారాయణ, ఆవాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

వేపాడ: మండలంలో వీలుపర్తి పంచాయతీ పెదదుంగాడ గ్రామంలో శ్మశానవాటికలో ఆక్రమణలను అధికారులు గురువారం తొలగించారు. తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు సమక్షంలో మండల సర్వేయర్ అప్పలనాయుడు, వీఆర్వో ఆంజనేయులు, సిబ్బంది శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేసి సుమారు 62 సెంట్లు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. అధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది జేసీబీ సాయంతో ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.


ఆక్రమణలు తొలగించిన రెవెన్యూ సిబ్బంది


వృథాగా పోతున్న తాగునీరు

తాగునీటి వృథా

లక్కవరపుకోట: వేసవిలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారుల నిర్లక్ష్యంతో తాగునీరు వృథాగా పోతోంది. మండలంలోని గంగుబూడి పంచాయతీ శివారు గజపతినగరం గ్రామంలో వీధి కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. కుళాయిలకు హెడ్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతోందని, హెడ్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

ఉపాధి పనులు ప్రారంభం


ఉపాధి పనులు ప్రాంభిస్తున్న సర్పంచ్

గజపతినగరం రూరల్: మండలంలోని పీఎస్ఆర్ పురం రామప్పవారిబందలో ఉపాధిహామీ పనులను స్థానిక సర్పంచ్ పైడపునాయుడు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనోపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసలు నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించడంతో పాటు రోజుకు రూ.250 కూలీ గిట్టుబాటు అయ్యేలా పని కల్పిస్తున్నట్లు చెప్పారు. పని కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట మారుతినగర్ కాలనీలో షిర్డీసాయి ఆలయ 16వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో జిల్లా శిష్టకరణ సంఘం ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ నేత రేగ సురేష్(గోవింద), ఆయన సతీమణి పురిటిపెంట-2 ఎంపీటీసీ సభ్యురాలు రేగ లత, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు దొగ్గ దేవుడుబాబు, కార్యదర్శి సుధాకర్ పట్నాయక్, బగ్గాం దామోదర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వేపాడ: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీఎస్ఎన్‌కే పట్నాయక్ తెలిపారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని కోరారు. అలాగే సభ్యులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఘనంగా ముత్యాలమ్మ సప్తమ వార్షికోత్సవం


ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి సప్తమ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

బస్ షెల్టర్ నిర్మాణం



కొత్తవలస: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కంటకాపల్లి సమీపంలోని శారద మెటల్స్ అండ్ అల్లోయిస్ కార్మాగారం సీఎస్ఆర్‌సీ నిధులు రూ.5 లక్షలతో దీన్ని నిర్మించారు. ఈ బస్ షెల్టర్ వినియోగంలోకి వస్తే ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉంటుంది.

మరిడిమాంబ పండుగ ప్రారంభం


అమ్మవారి ఘటాలను తీసుకొస్తున్న మహిళలు

శృంగవరపుకోట: మండలంలోని సీతారాంపురం గ్రామంలో గ్రామదేవత మరిడిమాంబ పండుగ గురువారం సాయంత్రం ప్రారంభమైంది. ఆలయ ధర్మకర్త, గ్రామ సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు ఇంటి నుంచి అమ్మవారి ఘటాలను డప్పులు, బాణసంచా మోతల మధ్య ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు ఇచ్చి, చీర, సారెలు పెట్టి, మొక్కులు చెల్లించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం..


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

- ఎంపీపీ హైమావతి

గంట్యాడ: తాగునీటి సమస్య పరిష్కారానికి క్రాస్ ప్రోగ్రాం అమలు చేస్తున్నామని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూఎస్, విద్య, వైద్యం, ఉపాధిహామీ, వెలుగు, గృహనిర్మాణం, ఐసీడీఎస్, విద్యుత్, పశు సంవర్ధకశాఖ, ఇరిగేషన్ శాఖలపై సమీక్షించారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మే నెలఖారు నాటికి విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో నిల్వ చేస్తామని ఏఓ బి.శ్యామ్‌కుమార్ తెలిపారు. క్రాస్ ప్రోగ్రాం ద్వారా గ్రామాల్లో పాడైన బోర్లు బాగు చేయిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సునీల్‌కుమార్ వివరించారు. కళాశాల తెరిచే నాటికి నాడు–నేడు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నోట్ పుస్తకాలు పూర్తి స్థాయిలో వచ్చేసాయని, కొన్ని తరగతులకు చెందిన పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ విజయలక్ష్మి చెప్పారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే వేతనదారుల ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవాలని ఏపీఓ ఆదిలక్ష్మి తెలిపారు. ఉపాధి మస్తర్ల నమోదులో అవకతవకలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సంబంధిత అధికారులకు సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి మంచి స్పందన వస్తోందని, గ్రామాలకు వెళ్లే ముందు స్థానిక ఎంపీటీసీ, సర్పంచ్‌లకు సమాచారం అందించాలన్నారు. తీర్మానాల పేరుతో బుక్ కీపర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారని, దానిపై విచారణ చేపట్టాని వెలుగు ఏపీఎం శ్రీనివాస్‌ను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రీడా శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- సెట్విజ్ సీఈఓ రాజగోపాల్

చీపురుపల్లి: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని సెట్విజ్ సీఈఓ రాజగోపాల్ అన్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణా శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణలతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్, వాలీబాల్ విభాగాల్లో మే 1 వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతీ రోజూ ఉదయం 6 గంటలు నుంచి 8 గంటలు వరకు సాయంత్రం 4 గంటలు నుంచి 6 గంటలు వరకు శిక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళగిరి శ్రీను, ఇప్పిలి తిరుమల, కొసిరెడ్డి రమణ, కోరుకొండ దాలయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పీసీ స్వరూప్, కె.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు

గంట్యాడ: విధి నిర్వహణలో అలసత్వం వహించిన నలుగురు క్షేత్ర సహాయకులకు మెమోలు జారీ చేసినట్టు ఏపీఓ ఆదిలక్ష్మి తెలిపారు. జాబ్ కార్డు అడిగిన ఇవ్వకపోవడం, తక్కువ మందితో పని చేయించడం, సక్రమంగా పని చేయించకపోవడం తదితర కారణాలతో మెమోలు ఇచ్చినట్టు చెప్పారు. పెదమజ్జపాలెం, జగ్గాపురం, పెదవేమలి, వసంత క్షేత్ర సహాయకులకు మెమోలు జారీ చేశారు.

వినతులను సకాలంలో పరిష్కరించాలి

దత్తిరాజేరు: సచివాలయాలకు భూసమ్యలపై వచ్చిన వినతులను సాకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ రమేష్ వీఆర్వోలను ఆదేశించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో 1బీ, అడంగల్, మ్యుటేషన్లకు సంబంధించిన దరఖాస్తులతో పాటు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని వీఆర్వోలను ఆదేశించినట్లు తెలిపారు.

కాలువల నిర్మాణం

గుర్ల: మండలంలోని పెనుబర్తిలో ప్రధాన రహదారికి ఇరువైపులా కాలువలు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబల్ల చిన్నారావు తెలిపారు. గురువారం పనులను పరిశీలించారు. సుమారుగా రూ.3 లక్షలతో కాలువలు నిర్మిస్తున్నటుల చెప్పారు. అనంతరం సీసీరోడ్డు వేస్తామన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం శతశాతం విజయవంతం అయిందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. గురువారం ఆమె ఛాంబర్‌లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు అతికించేందుకు ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజల నుంచి అపూర్వ స్పందన వచ్చిందన్నారు. కుల, మతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అయితే కొంతమంది అధికారుల నిర్లక్ష్య ధోరణి వల్ల అక్కడక్కడ చిన్న చిన్న సమస్యలు వస్తున్నాయన్నారు. వారు తీరు మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న పండితులు

జామి: మండలంలోని కుమరాం గ్రామం కల్యాణ్‌నగర్‌లో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి స్వామివారి తులాభార సేవ నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో ఉదయం పూర్ణహుతి, ప్రత్యేక హోమం, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమృతవల్లి రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రాజరాజేశ్వరిదేవికి పూజలు


గాజుల అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో వెలసిన రాజరాజేశ్వరి దేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించి విశిష్ట పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.